క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లాలుపురం రాము, పానుగంటి

పట్నంబజారు: శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి జన్మదినోత్సవం పురస్కరించుకుని శనివారం విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో స్వర్ణభారతీనగర్‌లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు పద్మజ, ఈచంటిపాటి వెంకటకృష్ణ (ఆచారి), రబ్బాని, వెంకటరమణ పాల్గొన్నారు.

3న పాలిటెక్నిక్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్–2023 కన్వీనర్ మార్గదర్శకాల ప్రకారం డిప్లొమాలో సివిల్, ఎలక్ట్రికల్, ఈసీఈ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగాల్లో నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 83329 11155, 93907 87574 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవలింగారావు మాట్లాడుతూ ప్రభుత్వం బలవంతంగా తీసుకువచ్చిన జీపీఎస్‌ను అంగీకరించే ప్రసక్తి లేదని తెలిపారు. జీపీఎస్ ప్రతిపాదనతో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఉద్యమం దారిమళ్లి, ఆర్థిక పరమైన అంశాలు వెనక్కు వెళ్లాయని ఆరోపించారు. 11వ పీఆర్సీ, పీఎఫ్, డీఏ బకాయిలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వో కె. చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. ఖాలీద్, నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



పాత గుంటూరు: నగరంలోని హిందూ కళాశాలలో రెడ్‌క్రాస్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ అజయ్ బాలకృష్ణన్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ వడ్లమాని రవి, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ రామచంద్రరాజు, హిందూ కళాశాల ఉపాధ్యక్షులు ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ పి.ఎం.ప్రసాద్ పాల్గొన్నారు. కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మేజర్. చుక్కా నవీన్ కుమార్, కో–ఆర్డినేటర్ రాములు, మేడూరి భాస్కరరావు పాల్గొన్నారు.

ఎన్ఈపీ సారథులుగా వీవీఐటీ విద్యార్థులు



పెదకాకాని: జాతీయ విద్యా విధానం 2020 అమలులో విద్యార్థుల్ని భాగస్వామ్యం చేసే లక్ష్యంతో యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఏర్పాటు చేసిన ఎన్ఈపీ (నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ) సారథి కార్యక్రమంలో బ్రాండ్ అంబాసిడర్లుగా వీవీఐటీ విద్యార్థులు మామిళ్ల మాధురి, రావుల రాజీవ్ చౌదరి, సంగు వెంకట ప్రశాంత్‌రెడ్డి ఎంపికయ్యారని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో శనివారం ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది ఉన్నత విద్యాసంస్థల నుంచి 23 మందికి మాత్రమే ఈ అవకాశం రాగా, వారిలో ముగ్గురు వీవీఐటీ విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎన్ఈపీ లక్ష్యాల్ని మరింత సులభతరం చేసేందుకు, విద్యా సంస్కరణలు విజయవంతంగా అమలు చేసేందుకు గాను ఎన్ఈపీ సారథులు తోడ్పడతారన్నారు. విద్యాసంస్థల్లో సదస్సులు, చర్చలు, పోటీలు నిర్వహించడం, సోషల్ మీడియా ద్వారా ప్రచారం, హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చైర్మన్ తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, కార్పొరేటర్ పద్మావతి

గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్లు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. శనివారం 24వ డివిజన్ పరిధిలోని చుట్టుగుంట సెంటర్‌లో రూ.22 లక్షలతో చేపడుతున్నట్లు రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. డివిజన్లలో దశల వారీగా రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు రోడ్లు, కాలువల నిర్మాణానికి ఇబ్బందులకు గురి కాకుండా సమస్యల్ని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే పరమావధిగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్నట్లు చెప్పారు. అన్ని డివిజన్లలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించి, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో నగరం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. జగనన్న పాలనలో వాడవాడలూ క్రమక్రమంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఆంధ్ర రాష్ట్రం దేశానికే దిక్సూచీగా మారిందని పేర్కొన్నారు. సుపరిపాలనకైనా, సమగ్రాభివృద్ధి అయినా సీఎం వై.ఎస్. జగన్‌తోనే సాధ్యమని ప్రతిపక్షాలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే హితవు పలికారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని సైతం కళ్లకు కట్టినట్లు ప్రజలతో పాటు ప్రపంచానికి కనపడే విధంగా పరిపాలన చేస్తున్న ఘనత సీఎం వై.ఎస్. జగన్‌కు దక్కుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనుల్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ అడకా పద్మావతి, నాయకులు షేక్ బాజీ, కోలా సునీల్, షేక్ నాగూర్ బాషా, ఈఈ సుందర్ రామిరెడ్డి, డీఈ రమేష్ బాబు, ఏఈ రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టులో ఎలాంటి కుట్రలు లేవు

పట్నంబజారు: నారా చంద్రబాబు నాయుడు అరెస్టులో రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేయలేదని, ఆయన నేరం చేశారు కాబట్టే రిమాండ్‌కు వెళ్లారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. శ్యామలానగర్‌లోని ఆయన నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏసీబీ కోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు రిమాండ్‌ను సమర్థిస్తున్నారంటే తప్పు ఉందని అర్థమవుతోందని తెలిపారు. రాజకీయ లబ్ధి, సానుభూతి కోసం ఎన్ని రకాలుగా టీడీపీ నేతలు మాట్లాడినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. కోర్టుల్ని మేనేజ్ చేయడం టీడీపీ నేతలకు కొత్తేమీ కాదని, కానీ అక్కడే చుక్కెదురైందంటే కచ్చితంగా నేరం చేసినట్లు స్పష్టమవుతోందని చెప్పారు. పవన్ కల్యాణ్ వైఎస్సార్ సీపీపై యుద్ధం చేస్తున్నానని చెబుతున్నారని, అది రోడ్లపై కాకుండా కోర్టులో చేస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష అద్భుతం

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష అద్భుతమైన కార్యక్రమని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. శ్యామలానగర్‌లోని ఆయన నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఆరోగ్యశ్రీలో 850 జబ్బులకు మాత్రమే వైద్యం ఉండేదని తెలిపారు. సీఎంగా వై.ఎస్.జగన్ బాధ్యతలు చేపట్టాక 3,100 జబ్బుల్ని చేర్చారని గుర్తు చేశారు. పేదలకు వైద్యాన్ని దగ్గర చేసే దిశగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటింటికీ వైద్యాన్ని పంపారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.60 కోట్ల కుటుంబాలకు జగనన్న సురక్ష ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, ఏదైనా ఇబ్బంది ఉంటే ఆసుపత్రులకు రిఫర్ చేయడంతో పాటు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. సుమారు లక్ష మంది వైద్యులు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గిరిధర్ సూచించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ఆరోగ్య భరోసా

మేయర్ కావటి



వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న మేయర్

పట్నంబజారు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. ఇశ్రాయిల్‌పేట హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో జగనన్న ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. నిపుణులైన వైద్యులతో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటిల్లో అన్ని మౌలిక వసతులతో పాటు సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి సచివాలయ కార్యదర్శి భాగస్వాములవుతారని, వైద్య పరీక్షలు చేయించుకున్నవారికి రిపోర్టు, అవసరమైన మందుల కిట్ అందిస్తామని ఆయన తెలిపారు. శిబిరంలో అన్ని వ్యాధులకు వైద్యులు అందుబాటులో ఉంటారని మేయర్ చెప్పారు. ప్రతి హెల్త్ సెంటర్‌లో ఇద్దరు వైద్యుల్ని అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు. ప్రతి ఇంటిని ఆరోగ్య సురక్షలో భాగంగా జల్లెడపట్టి అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేసి, వైద్యం అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మర్రి అంజలి, డెప్యూటీ కమిషనర్లు శ్రీనివాసరావు, వెంకటకృష్ణయ్య, ఎంహెచ్‌వో భానుప్రకాష్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ హరికృష్ణకు అవార్డు



గుంటూరు మెడికల్: గుంటూరు ధృతి హాస్పిటల్ ఫౌండర్, డైరెక్టర్, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్టు డాక్టర్ రేవూరి హరికృష్ణకు 'మోస్ట్ ఎఫర్డబుల్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఇన్ ఆంధ్రప్రదేశ్ 2023' అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో శనివారం ఆసియా టుడే రీసెర్చ్ మీడియా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళ సై చేతుల మీదుగా డాక్టర్ హరికృష్ణ అవార్డు అందుకున్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో అత్యాధునిక వైద్య సేవల్ని అందరికీ అందుబాటులో తీసుకు రావడంతో హాస్పిటల్‌కు అవార్డు లభించిందని డాక్టర్ హరికృష్ణ తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఇశ్రాయేల్‌పేటలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్

నెహ్రూనగర్: బాలింతలు, గర్భిణులు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని సీడీపీవో టి. కృష్ణవేణి తెలియజేశారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇశ్రాయేల్‌పేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ ఆహారాన్ని తీసుకోవడం వల్ల రక్తహీనత నివారణతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీవో చంద్రకళ, సూపర్‌వైజర్ ఎన్.ఎస్. తబిత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగాలని గణేశునికి ప్రత్యేక పూజలు



గుంటూరు మెడికల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజా సంక్షేమ పాలనకు వస్తున్న అడ్డంకులు తొలగిపోవాలంటూ సిమ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ భీమనాథం భరత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం 52వ వార్డు శాంతీనగర్‌లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖ నగర డెప్యూటీ మేయర్ శ్రీధర్‌తో కలసి పూజలు నిర్వహించారు.

బస్టాండ్ సమీపంలో బస్సులు నిలిపితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ షేక్ కరీం, ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు

పట్నంబజారు: కాంట్రాక్టు క్యారేజీ బస్సుల్ని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిలిపితే చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం స్పష్టం చేశారు. గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.బాలసుందరరావుతో కలసి శనివారం రాత్రి కాంట్రాక్టు క్యారేజీ బస్సుల యజమానులు, నిర్వాహకులతో స్వర్ణభారతీనగర్‌లోని ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ కరీం మాట్లాడుతూ నగర పరిధిలో మూడు కిలోమీటర్లు, పట్టణ పరిధిలో రెండు కిలోమీటర్లు లోపు బస్సులు నిలపరాదని తెలిపారు. కాంట్రాక్టు బస్సుల యజమానులు, టికెట్ బుకింగ్ ఏజెంట్లు పూర్తిస్థాయిలో నిబంధనలకనుగుణంగా నడుచుకోవాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రూ. 2.50 లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ



పట్నంబజారు: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా సంగడిగుంట శ్రీవారి యూత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లడ్డూ వేలం పాటను రూ. 2.50 లక్షలకు హైదర్ అలీ పాడారు. కార్యక్రమంలో వేమారెడ్డి, సయ్యద్ రియాజ్, సునీల్, ప్రవీణ్‌కుమార్, ప్రశాంత్, రవి, హుమాయన్ చిష్టి పాల్గొన్నారు.


ఏపీ ఎన్జీవో ఆధ్వర్యంలో 'జగనన్నకు వందనం'



జగనన్నకు వందనం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

గుంటూరు మెడికల్: గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగుల వ్యవస్థ ప్రారంభమై నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం గుంటూరులోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో జగనన్నకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాస్, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు సేవల్ని మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని తెలిపారు. దీనిద్వారా ప్రజలకు పలు సేవలు సులువుగా, త్వరితగతిన అందుతున్నాయని చెప్పారు. ఈ వ్యవస్థ ద్వారా దేశంలోనే మొట్టమొదటిసారిగా లక్షకు పైగా యువత ఒకేసారి ప్రభుత్వ ఉద్యోగాలు పొంది తమ జీవితాల్లో మార్పు పొందారని వివరించారు. అనంతరం జగనన్నకు వందనం పోస్టర్లను యూనియన్ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమానికి సచివాలయ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



లక్ష్మీపురం: రైల్వే గేటు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని రైలు ఢీకొని యువకుడు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామానికి చెందిన కర్రసాని వాసు (26) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గుంటూరులోని శ్యామలానగర్ రైల్వే గేటు దాటుతున్న సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

చైల్డ్ ట్రాఫికింగ్‌పై అవగాహన అవసరం

గుంటూరు రూరల్: చైల్డ్, మెన్ ట్రాఫికింగ్‌పై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ బేబీరాణి తెలిపారు. నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు చైల్డ్ ట్రాఫికింగ్, పోక్సో చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫికింగ్‌కు పాల్పడేవారు అనేక మాయమాటలు చెబుతారని, వాటిని వినవద్దని సూచించారు. అపరిచితుల వెంట బయటకు వెళ్లరాదని చెప్పారు. వరకట్నం వేధింపులు, చట్టాల గురించి వివరించారు. చదువే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో క్రాఫ్ట్ సంస్థ ప్రతినిధులు స్వర్ణలత, పద్మజ, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు జి.పాప, చంద్రికారాణి, సుధారాణి, వెంకటరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

లక్ష్మీపురం: అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఏటా అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వృద్ధులు ఆనందంగా ఉండటం ఎలా ? అనే అంశంపై వి.వి.రావ్ పలు సూచనల్ని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి: ఏపీటీఎఫ్



సమావేశంలో వేళాంగిణిరాజు, మేకల సుబ్బారావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు గత జూలై నుంచి మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు గోవిందు వేళాంగిణిరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంపాలెంలోని సంఘ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బిల్లుల్ని గ్రామ పంచాయతీలే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేయాలని, దీని కారణంగా విద్యారంగంలో జరిగిన నష్టాన్ని సవరించాలని కోరారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జె. విజయానంద్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

దేశ స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత



కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రం చేసిన అధ్యాపకులు, విద్యార్థులతో మనోహర్, సుధీర్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే సమాజం స్వచ్ఛంగా ఉంటుందని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రోజు ఒక గంట సేపు స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని, దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని సూచించారు. హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేయాలని, పర్యావరణానికి హాని కలిగించే వస్తువుల్ని ఉపయోగించరాదని తెలిపారు. కళాశాలలో పరిసరాల పరిశుభ్రత, క్రీడా ప్రాంగణం, తరగతి గదుల్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాతీయ సేవా పథక కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ జేవీ సు. ధీర్ కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారిణి ఆర్. జయశైలజ, అధ్యాపకులు శ్రీమతి కె.శ్రావణి, డాక్టర్ ఏ.అంజనీ కుమార్, జ్యోతి, నాగమణి, జమృద్ బేగం, ఆర్.స్వామి, మేజర్ పి. కుమార్‌రాజా, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన డాక్టర్ అశోక్‌కుమార్‌కు సన్మానం



డాక్టర్ అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా పనిచేస్తూ విశాఖపట్నం కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై వెళ్లిన డాక్టర్ అశోక్‌కుమార్‌కు ఆసుపత్రిలో శనివారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ యశస్వి రమణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్యులకు నచ్చిన చోట పదోన్నతులు కల్పిస్తూ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి నియామకాలు చేపట్టారన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు కొత్తవి వస్తున్నాయని తెలిపారు. గతంలో అడిషనల్ డీఎంఈ పోస్టులు 10 నుంచి 15 మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 56 పోస్టులు అందుబాటులో వస్తున్నాయని చెప్పారు. అనంతరం డాక్టర్ అశోక్ కుమార్‌కు జ్ఞాపికను అందచేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాస్, డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడటం నేరం



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ జి. స్పందన

గుంటూరు రూరల్: ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరమని, దాని ద్వారా విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ (ఎక్సైజ్) జి. స్పందన సూచించారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన 'ఇల్ ఎఫెక్ట్స్ ఆఫ్ ర్యాగింగ్'పై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ర్యాగింగ్ అనేది పాశ్చాత్య దేశాల నుంచి వచ్చిన ఆటవిక చర్యగా పేర్కొన్నారు. తోటి విద్యార్థుల్ని ఆట పట్టించే క్రమంలో అనేక మంది చదువుల్ని అర్ధంతరంగా మధ్యలో ఆపడమే కాకుండా, ప్రాణాలు కోల్పోవడానికి కారణమవుతుందని చెప్పారు. ఎవరైనా ర్యాగింగ్‌కి పాల్పడితే వెంటనే కేసును నమోదు చేసి శిక్షను అమలు చేస్తామని తెలిపారు. ప్యానల్ అడ్వకేట్ కె. కాళిదాస్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ వంటి దుష్ప్రభావాలకు లోనవ్వకుండా లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని చెప్పారు. తల్లిదండ్రుల పరువు, ప్రతిష్టలను కాపాడే విధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గం పాల్గొంది.

ఆయుష్మాన్ భవ హెల్త్ మేళాకు స్పందన



కార్డులను అందజేస్తున్న హర్ష మంగళ

వేజండ్ల(చేబ్రోలు): మండలంలోని వేజండ్లలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య, సంరక్షణ కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన మెగా హెల్త్ మేళాకు విశేష స్పందన లభించింది. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ హర్ష మంగళ క్షేత్రస్థాయిలో ఆయుష్మాన్‌భవ పనితీరును పర్యవేక్షించారు. వేజండ్ల–2 గ్రామ సచివాలయ ప్రాంగణం వద్ద జరిగిన కార్యక్రమానికి పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి ఆయుష్మాన్ భవ కార్డులు, ఆర్గాన్ డోనర్స్ సర్టిఫికెట్లు, ఆరోగ్య పోషణ కిట్లను హర్ష మంగళ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాబూరావు పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణలతో ఉజ్వల భవిష్యత్



ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

ప్రత్తిపాడు: వినూత్న ఆవిష్కరణల ద్వారా విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఇంజినీరింగ్ కళాశాలలో మీన్ స్టేక్‌పై శుక్ర, శనివారాల్లో 36 గంటల పాటు హ్యాకథాన్‌ను నిర్వహించారు. 180 మంది విద్యార్థినీ, విద్యార్థులు వ్యవసాయం, రవాణా, ఆరోగ్యం, పర్యావరణం, సైబర్ సెక్యూరిటీ అంశాలపై పలు ప్రయోగాలు చేసి ప్రదర్శించారు. జ్యూరీ మెంబర్లుగా హైదరాబాద్ ఇన్ఫోసిస్ లిమిటెడ్ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ సుంకవల్లి అచ్యుత రాజేష్, వండర్ ఫ్లెక్స్ ట్రావెల్ సీఈవో, కో– ఫౌండర్ సీహెచ్. పెంచల తరుణ్, బిడ్ అలర్ట్ ఫౌండర్ కె. అజయ్‌కుమార్, హ్యాపీ పే సీఈవో, ఫౌండర్ కసిరెడ్డి దేవీకిరణ్ వ్యవహరించారు. ఐదు ఉత్తమ ఆవిష్కరణల్ని ఎంపిక చేసి బహుమతుల్ని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ సుబ్బారావు, సెక్రటరీ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చేసిన ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడే ప్రొడక్ట్స్‌గా అభివృద్ధి చేసేందుకు కావలసిన ఆర్థిక సాయంతో పాటు వసతుల్ని సమకూర్చనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్. రమేష్ పాల్గొన్నారు.

